APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక
neelagirivartha@gmail.com

ఏపీ & తెలంగాణ | ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి | శుక్రవారం | 23 - 05- 2025 | సంపుటి : 15 | సంచిక : 289 | పేజీలు : 12 | వెల : 5/- | అసోసియేట్ ఎడిటర్ : చెన్నూరి అన్వేషి



అభివృద్ధిలో భాగమే రైల్వేల ఆధునీకరణ

2 లో..



తెలంగాణలో వేగంగా అభివృద్ధి పనులు

7 లో..



# బాంబులు పెట్టి పేల్చారేమో



- కాంగ్రెస్, బీజేపీ దొంగలే మేడిగడ్డ దగ్గర బాంబు పెట్టారేమో
- కెసిఆర్ పేరు లేకుండా చేసేందుకే కుట్రలు
- వరంగల్ సభ విజయవంతం కాగానే నోటీసుల డ్రామాలు
- అందాల పోటీలతో దుబారా ఖర్చులు
- సిఎం రేవంత్, భట్టి మధ్యనా ఈ అందాల పోటీలు
- పార్టీ కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్- నీలగిరివార్త :

కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తెలుతుందని, ఒక బ్యారేజీలో రెండు పగుళ్లు వస్తే ఏదో అయినట్లు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మరోమారు మండిపడ్డారు. ఈ కాంగ్రెస్, బీజేపీ దొంగలే మేడిగడ్డ దగ్గర బాంబు పెట్టి పేల్చేశారని నా అనుమానం అంటూ అసహనం వ్యక్తం చేశారు. పాలమూరు లాగే కాళేశ్వరంలోనూ నిజం తెలుస్తుంది. చిల్లిగవ్వ పుట్టడం లేదంటూనే అందాల పోటీలు పెడుతున్నారు. రాష్ట్రం దివాళా తీసిందంటూనే దుబారా

మిగతా 2వ పేజీలో..

# పాక్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాం



- ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాం
- సిందూరం తుడిచిన వాళ్లకు ఆపరేషన్ సిందూర్‌తో జవాబిచ్చాం
- ఉగ్రవాదులను ఉసిగొల్పితే ఇక అంతే సంగతలు
- మరోమారు పాక్‌ను హెచ్చరించిన ప్రధాని మోడీ
- రాజస్థాన్ బికనీర్ వేదికగా పలు స్టేషన్లకు వర్చువల్‌గా ప్రారంభం

జయపుర- నీలగిరివార్త :

మన మహిళల సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. మన భద్రతా బలగాలు పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్విస్తున్నారని అన్నారు. రాజస్థాన్‌లో పర్యటిస్తున్న సందర్భంగా బికనీర్‌లో ఏర్పాటు చేసిన సభలో పహల్గామ్ గురించి మాట్లాడుతూ.. ఉద్వేగపూరితంగా ప్రపంగం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతం చేశామని తెలిపారు. కేంద్రం త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని గుర్తుచేశారు. మన దళాలు చక్ర వ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయని తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడికి జవాబుగా 22 నిమిషాల్లోనే ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు చెప్పారు. భారత్‌లో రక్తపుటేర్లు పారించిన వాళ్లను ముక్కలు.. ముక్కలు చేసినట్లు మోడీ పేర్కొన్నారు. మే 7న చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద గ్రూపులతో అనుబంధంగా ఉన్న దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటానికి భారతదేశం ఐక్యంగా ఉందని చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి 140 కోట్ల మంది భారతీయులను కదిలించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల గుండెపై దాడి చేశామన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛ నివ్వడంతోనే ఇదంతా

మిగతా 2వ పేజీలో..



## రెండో రోజూ కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ!

- గురువారం ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి వెళ్లిన హరీశ్‌రావు
- కాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం
- హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌కు కూడా ఇచ్చిన సంగతి తెలిసిందే!

2 లో..



## నాంపల్లి కోర్టుకు సీఎం రేవంత్ రెడ్డి

- ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులో హాజరు
- వచ్చేనెల 12న తీర్పు.. భారీ బందోబస్తు ఏర్పాటు

2 లో..



## బిఆర్ఎస్ ఫ్యామిలీలో భగ్గుమన్న విభేదాలు

- పార్టీలో పనితీరుపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర అసహనం
- బిజెపికి చేరువుతున్న తీరును తప్పు పట్టిన కవిత
- పార్టీలో ఎవరికీ అందనంత దూరంగా కెసిఆర్ తీరు
- కెసిఆర్‌ను ప్రశ్నిస్తూ.. లేఖను సంధించిన తనయ

7 లో..

# కళ్లకు కట్టినట్లు బిజెపి అభివృద్ధి

- కరీంనగర్ రైల్వే స్టేషనే ఇందుకు నిదర్శనం
- అమృత్ భారత్ స్కీంలో స్టేషన్ ఆధునీకరణ
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న బండి సంజయ్





కరీంగనర్ - నీలగిరివార్త:

గతంలో బీఆర్ఎస్ సహా కొన్ని పార్టీల నాయకులు రైల్వే అభివృద్ధిపై కేవలం లేఖలు రాసి బాధ్యతను దులుపుకున్నారని, కానీ అలా కాకుండా తాము అభివృద్ధికి కట్టుబడి పనిచేశామని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పుడు అభివృద్ధి కనిపిస్తున్న తరవాత కూడా ఇదంతా తమ వల్లే జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. మాటలకే పరిమితమవ్వకుండా వాస్తవిక ఫలితాలు చూపాలన్నది ప్రధాన విషయం. బుల్లెట్ దిగిందా? లేదా? అనేది ప్రజలే తేల్చాలని బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో కరీంనగర్ స్టేషన్ మార్పే నిదర్శనమన్నారు. అలాగే, జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 61 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మాణానికి సర్వే పూర్తయ్యిందని, డిటైల్డ్

మిగతా 2వ పేజీలో..

## స్టేషన్ అభివృద్ధికి నేనే పట్టుబట్టా

- నేటికి అది సాకారమయ్యిందన్న మంత్రి పొన్నం
- తిరుపతికి రోజూ రైలు సర్వీస్ నడపాలని వినతి

2 లో..

కరీంనగర్ :

తాను కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు ఆనాటి రైల్వే శాఖ మంత్రి మమతా బెనర్జీ ఉన్నప్పుడు కరీంనగర్ ఈ స్టేషన్ ను మార్పు చేయడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

### అన్నిహద్దులూ దాటేశారు ఇక చాలు!

# ఈడీ దూకుడుకు సుప్రీంకోర్టు బ్రేక్!

- వ్యక్తులపై కేసులు నమోదు చెయొచ్చు కానీ కార్పొరేషన్లపైనా మీ ప్రతాపం?
- జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలో సుప్రీం ధర్మాసనం ఈడీకి చీవాట్లు?
- కేంద్రం చెప్పినట్లు వింటూ దూకుడు ప్రదర్శిస్తున్న ఈడీకి ఇవాళ షాక్!



ప్రత్యేకప్రతినిధి - నీలగిరివార్త :

రాష్ట్రాల్లో అధికారంలో ప్రాంతీయ పార్టీల్ని, విపక్షాల్ని టార్గెట్ చేస్తూ కేంద్రానికి కొమ్ము కాస్తుందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కు ఇవాళ గట్టిఎదురుదెబ్బ తగిలింది. తమకు సంబంధం లేక పోయినా ప్రతీ అంశం లో కేంద్రం చెప్పినట్లుగా వింటూ దూకుడు ప్రదర్శిస్తున్న ఈడీకి ఇవాళ సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఈడీ అన్ని హద్దులూ దాటేస్తుందని సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు మద్యం కుంభకోణంపై దర్యాప్తు పేరుతో రాష్ట్ర మద్యం పంపిణీ సంస్థ టాస్మాక్ ను టార్గెట్ చేస్తున్న ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కు సుప్రీంకోర్టు ఇవాళ షాకిచ్చింది. మద్యం కుంభకోణం జరిగితే వ్యక్తుల్ని అరెస్టు చేసి విచారించాల్సింది పోయి సంస్థలపై కేసులు పెట్టి వేధించడం ఏంటని? ఈడీని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈడీ తీరు సమాఖ్య వ్యవస్థకు విరుద్ధంగా ఉందని సుప్రీం కోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. అంతే కాదు తమిళనాడు మద్యం

### తల్లడిల్లుతున్న దండకారణ్యం

# మావోయిస్టులకు అతిపెద్ద దెబ్బ

- 18 నెలల్లో 330 మంది మృతి
- దండకారణ్యంపై కేంద్రం ఫోకస్!
- సేఫ్ జోన్లలోకి చొచ్చుకెళ్లిన భద్రతా బలగాలు
- బీజాపూర్, సుక్మా, నారాయణపూర్, అబూజ్‌మడ్‌పై ఉక్కుపాదం!
- హెలికాప్టర్లు, ప్రత్యేక రోబోట్‌లు, డ్రోన్లతో ఆపరేషన్!
- ముమ్మర కూంబింగ్‌తో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి!
- మారణకాండకు వ్యతిరేకంగా 26న బంద్‌కు పిలుపు



చెన్నూరి అన్వేషి - ప్రత్యేకప్రతినిధి నీలగిరివార్త:

తుపాకీ మోతలు, తూటాలతో దూసుకొస్తున్న దండకారణ్యం కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్‌కౌంటర్ తొలిసారి కోలుకోలేని ఎదురుదెబ్బ అంటున్న పరిశీలకులు. ఏడాదిన్నర కాలంలో 330 మంది మృతి దండకారణ్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టి సేఫ్ జోన్లలోకి చొచ్చుకెళ్లిన భద్రతా బలగాలు. బీటలువారుతున్న నక్సల్స్ కంచుకోటలు బీజాపూర్, సుక్మా, నారాయణపూర్, అబూజ్‌మడ్ పై ఉక్కుపాదం మోపి ముమ్మరకూంబింగ్‌తో మావోయిస్టు లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న భద్రతా బలగాలు. బీటలువారుతున్న నక్సల్స్ కంచుకోటలు వ్యూహాత్మకం గా ముందుకుసాగిన భద్రతా బలగాలు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్‌కౌంటర్ ఇదే తొలిసారి కోలుకోలేని ఎదురుదెబ్బ అంటున్న పరిశీలకులు దశాబ్దాల పాటు ఎత్తుకు పైఎత్తులు, వ్యూహాలకు ప్రతివ్యూహాలతో మావోయిస్టులు, భద్రతాబలగాల మధ్య దండకారణ్యం లో సాగుతున్న పోరు ఒక ఎత్తైతే నక్సల్ మిషన్ 2026 మరో ఎత్తుగా నిలిచింది. తుపాకీ మోతలు దూసుకొస్తున్న తూటాలతో దండకారణ్యం దద్దరిల్లుతోంది. ఒక్కొక్కరుగా అన్నలు నేలకొరుగుతుంటే అడవితల్లి తల్లడిల్లుతోంది. ఏడాది కాలంలోనే వందలాది మంది మావోయిస్టులు తుపాకీ తూటాలకు బలయ్యారు. కీలక స్థావరాలపై ఫోకస్! వామపక్ష తీవ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. దీంతో నక్సల్స్ ఇలాకా అబూజ్ మడ్‌లో భద్రతా బలగాలు గతేడాది కాలుమోపాయి. 2024లో దండకారణ్యంలో మావోయిస్టుల సంచారంపై ఉక్కుపాదం మోపేలా ప్రతి

మిగతా 2వ పేజీలో..

# ఐఏఎస్‌లా? పాదదాసులా?

చెన్నూరి అన్వేషి - (ప్రత్యేక ప్రతినిధి నీలగిరివార్త)

- సీఎంలకు ఆ పాదాభివందనాలేంటి?
- గతంలో కేసీఆర్ కాళ్లు మొక్కిన వెంకట్రామిరెడ్డి?
- తాజాగా రాష్ట్ర గిరిజన శాఖ ముఖ్య కార్యదర్శి శరత్?
- ఇద్దరూ కన్ఫర్డ్ ఐఏఎస్ అధికారులే! ఇవేం పోకడలంటున్న ప్రజలు?
- గతంలో ఐఏఎస్ అధికారులపై దాడుల్ని ఖండించిన అసోసియేషన్
- ఐఏఎస్ అధికారుల పాదాభి వందనాల పై మాత్రం స్పందన లేదు!
- అఖిల భారత సర్వీసు అధికారుల గౌరవమర్యాదలు మంటగల్పుతారా?
- ఐఏఎస్‌ల పాదాభివందనాలు చూసి జనం ఛీ కొడుతున్న పరిస్థితి?

పాలకులు ఐదేళ్లకోసారి మారిపోడం సర్వసాదారణమైన విశయం. అధికారులు మాత్రం అక్కడే కొనసాగుతుంటారుఅంటే వీరికి ఏ ప్రభుత్వంతోనూ అనుబంధాలు ఉండవు. ఉన్నా అవి విధి నిర్వహణ కే పరిమితం. కానీ కొందరు ఐఏఎస్ అధికారులుముఖ్యమంత్రులకు పాదాభివందనం చేయడానికి ఉత్సాహం చూపడం తీవ్ర స్థాయిలో విమర్శలకు తావిస్తున్నది. భారత దేశంలో అఖిల భారత సర్వీసు ( ఏఐఎస్) అధికారులకు గౌరవం, మర్యాదలు ఉన్నాయి. అఖిల భారత సర్వీసులో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌వో లు రాష్ట్ర సర్వీసులలో పనిచేస్తున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా కొందరు ఐఏఎస్‌లు ప్రవర్తిస్తున్న తీరు వారి హోదాను, హుందాతనాన్ని పలుచన చేస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అటెండర్లు, దఫేదార్లు నయం. కనీసం వారి విధి నిర్వహణవరకు పరిమితమవుతారు కానీ పలువురు ఐఏఎస్ అధికారులు ముఖ్యమంత్రుల కాళ్లు మొక్కుతున్న నేపథ్యం. అదేదో నాలుగు గోడల మధ్య ఇద్దరు ఉన్నప్పుడు ప్రవర్తిస్తే ఎవరికీ తెలియకపోవచ్చు. కానీ బహిరంగంగా వేలమంది చూస్తుండగా సాష్టాంగ పడిపోతున్నారు. ఐఏఎస్‌ల పాదాభివందనాలు చూసి సాధారణ జనం ఛీ కొడుతున్నారు. ఇలాంటి వారు ప్రజలకు ఏం సేవ చేస్తారు? చట్టాలను ఎలా అమలు చేస్తారు? అంటూ మండిపడుతున్నారు. నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం

మిగతా 2వ పేజీలో..



## ఫెమా నిబంధనలకు విరుద్ధంగా భూమి కొనుగోలు

ఎమ్మెల్యే యశస్విని అత్త ఝాన్సీరెడ్డికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్- నీలగిరివార్త :

పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్త ఝాన్సీ రెడ్డికి హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఝాన్సీరెడ్డితో పాటు ఆమె భర్త రాజేందర్ రెడ్డికి కూడా నోటీసులు జారీ చేసింది. ఝాన్సీ రెడ్డి 2017లో తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో 75 ఎకరాల భూమిని కొన్నారు. ఫెమా నిబంధనలను ఉల్లంఘించి భూమి కొనుగోలు చేసిందని దామోదర్ రెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. నిబంధనలకు విరుద్ధంగా ఝాన్సీ రెడ్డికి పాస్ బుక్ మంజూరు చేశారని రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ, సీసీఎల్ఏ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహశీల్దా ర్లకు సైతం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. భూమి విషయంలో విచారణ పూర్తి చేసి నివేదికను అందించాలని ఈడీ జాయింట్ డైరెక్టర్ కు నోటీసులు జారీ చేసింది హైకోర్టు. ప్రస్తుతం ఆమె పాలకుర్తి కాంగ్రెస్ ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. గత



మిగతా 2వ పేజీలో..

## పాక్ నిఘా కార్యకర్తలతో సంభాషణ

- ఉగ్రవాదులతో లింక్ మాత్రం లేదు
- యూట్యూబర్ జ్యోతి కేసులో పోలీసుల విశ్లేషణ

న్యూఢిల్లీ- నీలగిరివార్త :

యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు ఉపశమనం లభిస్తోంది. పాకిస్తాన్ నిఘా కార్యకర్తలతో జ్యోతి సంప్రదింపులు జరిపిందని, అయితే, ఉగ్రవాదంతో ఆమెకు ఎటువంటి సంబంధాలు లేవని పోలీసులు తేల్చారు. జ్యోతి మల్హోత్రా పాకిస్తాన్ నిఘా కార్యకర్తలతో తెలిసి సంభాషించినప్పటికీ, ఆమెకు ఉగ్రవాద కార్యకలాపాలు లేదా గ్రూపులతో సంబంధం ఉందని ఎటువంటి ఆధారాలు లేవని పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాకుండా, సాయుధ దళాల గురించి లేదా వారి ప్రణా ళికల గురించి మల్హోత్రాకు ఎటువంటి అవగాహన లేదని హిసార్ పోలీసు సూపరింటెండెంట్ తెలిపారు. ఆమె కాంటాక్ట్‌లలో కొందరు పాకిస్తానీ నిఘా కార్యకర్తలని తెలిసినప్పటికీ, ఆమె వారితో టచ్‌లో ఉందని ఆయన అన్నారు. 'ఇప్పటివరకు, ఆమె ఏదైనా ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొన్నట్లు లేదా ఏదైనా ఉగ్రవాద సంస్థతో ఆమె అనుబంధానికి సంబంధించిన ఆధారాలు మాకు దొరకలేదు. ఆమె ఏదైనా ఖఎక్షలను

మిగతా 2వ పేజీలో..



# రెండో రోజూ కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ!

ప్రత్యేక ప్రతినిధి - నీలగిరివార్త :



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ను మాజీ మంత్రి హరీశ్‌రావు కలిశారు. గురువారం ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి ఆయన వెళ్లారు. కాళేశ్వ రం కమీషన్ నోటీసుల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ అంశంలో తదుపరి కార్యాచరణపై నేతలిద్దరూ చర్చించే అవకాశం ఉంది. కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమీషన్ ఇటీవల నోటీసులు ఇచ్చిన సంగతి విదితమే. ఆయనతో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా ఇచ్చిన సంగతి విదితమే. 15 రోజుల్లో కమిషన్ ఎదుట హాజరుకావాలని పేర్కొంది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే! కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో వారిద్దరికీ కమిషన్ నోటీసులు జారీ చేసింది.

# నాంపల్లి కోర్టుకు రేవంత్ రెడ్డి

**ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులో హాజరు.. వచ్చేనెల 12న తీర్పు..**

ప్రత్యేకప్రతినిధి - నీలగిరివార్త :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని నాంపల్లి మనోరంజన్ కోర్టుకు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని రేవంత్ రెడ్డిపై గతంలో కేసు నమోదైన విషయం తెలిసిందే! ఆయన సీఎం హోదాలో కోర్టుకు హాజరు కావడం ఇది రెండోసారి. అప్పట్లో ఆయనపై బేగంబజార్‌తో పాటు నల్లగొండ,మెదక్ లలో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో ఆయన తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి రిజర్వేషన్లపై చేసిన కామెంట్లకు సంబంధించి కేసును ఎదుర్కొంటున్న నేపథ్యం. ఈ నేపథ్యంలోనే ఇవాళ గురువారం ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 3 కేసుల్లో వ్యక్తిగతంగాఆయన హాజరుకావాల్సి ఉన్న నేపథ్యంలోకోర్టువద్దపోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టు హాల్ వద్దకు ఇతరులకు అనుమతి ఇవ్వలేదు. కాగా,తనపై నమోదైనవన్నీ తప్పుడు కేసులని కోర్టుకు రేవంత్ రెడ్డి చెప్పారు.తాను ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదని అన్నారు. రేవంత్ రెడ్డి స్టేట్‌మెంట్‌ను కోర్టు నమోదు చేసుకుంది. నాంపల్లి కోర్టు వచ్చేనెల 12న తీర్పు ఇవ్వనుంది. విచారణ ముగిశాక రేవంత్ రెడ్డి కోర్టు నుంచి తిరిగి వెళ్లారు.

# పుష్కరాలకు వెళ్తుండగా ప్రమాదం

**కారు ఆటో ఢీకొని ఇద్దరు మృతి**

**కాళేశ్వరం :**
జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సరస్వతి పుష్కరాలకు కాళేశ్వరం వెళ్తుండగా కాటారం టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై కారు, ఆటో ఢీకొన్నాయి. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అయితే, గాయపడిన వారిలో వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన వారిని చిట్యాల మండలంలోని నైన్‌పాక వాసులుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు చెప్పారు.

# అభివృద్ధిలో భాగమే రైల్వేల ఆధునీకరణ

**వరంగల్ స్టేషన్ ప్రారంభోత్సవంలో డికె అరుణ**

**వరంగల్ :** అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా గురువారం వరంగల్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్రమంత్రి భూపతి శ్రీనివాస వర్మ, ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేసిన 103 రైల్వే స్టేషన్లలో వరంగల్, బేగంపేట్, కరీంనగర్ స్టేషన్లను ప్రారంభించడం గర్వకారణమన్నారు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి శ్రేణిలో భాగమే అని ఆమె తెలిపారు. రైల్వే స్టేషన్లను అత్యాధునిక సదుపాయాలతో పునఃనిర్మాణం చేసి, సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2014 నుంచి వరంగల్ ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఇదంతా మోడీ నిష్పక్షపాత పరిపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, రోడ్లు, రైల్వే రంగాల్లో కేంద్రం నిధులు కేటాయిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నదని, ఇది మతపరమైన లేదా ప్రాంతీయ వివక్ష లేకుండా దేశంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రధాని దృఢ సంకల్పానికి నిదర్శనమని ఆమె అన్నారు.

# పాక్ నిఘా కార్యకర్తలతో సంభాషణ

మొదటి పేజీ తరువాయి

వివాహం చేసుకోవా లనుకుంటున్నట్లు లేదా మతం మార్చుకోవాలను కుంటున్నట్లు చిత్రీకరించే ఏ పత్రాన్ని మేము కనుగొనలేదు' అని ఎస్పీ చెప్పారు. మల్హోత్రాకి చెందిన మూడు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు, వీటితోపాటు, మే 18న అరెస్టయిన వీసా ఏజెంట్ హర్కిరత్ సింగ్‌కు చెందిన రెండు మొబైల్ ఫోన్‌లను విశ్లేషణ కోసం ల్యాబ్స్‌కు పంపినట్లు ఎస్పీ వెల్లడించారు. 'జ్యోతి మల్హోత్రా ఐదురోజుల రిమాండ్‌లో ఆమెను కొన్ని కేంద్ర సంస్థలు విచారించాయి, కానీ ఆమె కస్టడీని మరే ఇతర ఏజెన్సీకి ఇవ్వలేదు. పబ్లిక్ డొమైన్‌లో వస్తున్నట్టు ఆమె 'డైరీ'లోని పేజీలు మా దగ్గర లేవు. తమ దగ్గర ఎటువంటి డైరీ లేదు,' అని ఎస్పీ స్పష్టం చేశారు. ఇలా ఉండగా, 33 ఏళ్ల ట్రావెల్ బ్లాగర్ అయిన జ్యోతి మల్హోత్రాను మే 16న పాకిస్తాన్ కార్యకర్తలతో సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నారనే ఆరోపణలతో అరెస్టు చేశారు. ఆమెపై అధికారిక రహస్యాల చట్టం, 1923లోని సెక్షన్లు 3,5 ఇంకా భారతీయ న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 152 కింద కేసునమోదు చేశారు. రిమాండ్ కాలంలో ఆమెను,జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు ప్రశ్నించారు.

# తల్లడిల్లుతున్న దండకారణ్యం

మొదటి పేజీ తరువాయి

అడుగూ వ్యూహాత్మకంగా వేస్తూ వచ్చాయి. మావోయిస్టులకు ప్రధాన స్థావరాలుగా ఉన్న బీజాపూర్, సుక్మా, నారాయణ పూర్, అబూజ్‌మడ్ ప్రాంతాల్లో ముమ్మర కూంబింగ్‌తో మావోయిస్టులను ఉక్కిరిబిక్కిరి చేశారు. డ్రోన్లు, హెలికాప్టర్లతో ఆపరేషన్ మావోయిస్టులకు పెట్టని కోటలుగా ఉన్న దండకారణ్యంలోని ప్రాంతాల్లో నూ కేంద్ర బలగాలు పాగా వేసుకుంటూ ఆపరేషన్‌ను కొనసాగించాయి. ఇక మావోయిస్టుల కు ప్రధాన కేంద్రంగా ఉన్న కర్రెగుట్టలను జల్లెడ పట్టేందుకు ఏకంగా 24 వేల మంది భద్రతా బలగాలను రంగంలోకి దింపి, హెలికాప్టర్లు, ప్రత్యేక రోబోట్‌లు, డ్రోన్లతో ఆపరేషన్ చేపట్టాయి. దాదాపు 20 రోజుల పాటు సాగిన ఈ ఆపరేషన్‌లో పదులసంఖ్యలో మావోయిస్టులు చనిపోయారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా2024 జనవరి నుంచి మొదలు పెట్టిన నక్సల్ మిషన్ 2026ను భద్రతా బలగాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయని ఉమ్మడి ఏపీ విశ్రాంత డీజీపీ హెచ్.జె.దొర అన్నారు. ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. డ్రోన్ల వినియోగం, హెలికాప్టర్ల వినియోగంతో కీకారణ్యంలోనూ మావోయిస్టుల జాడ తెలుసుకుని విరుచుకుపడ్డాయని వివరించారు. దండకారణ్యంలో ఏడాదికి పైగా హోరాహోరీగా సాగిన పోరులో భద్రతా బలగాలే పైచేయి సాధించాయని స్పష్టం చేశారు. మావోయిస్టు చరిత్రలో 2024లో జరిగిన ఎన్ కౌంటర్లలో 215 మంది మావోయిస్టులు మృతిచెందారు. 2025 జనవరి నుంచి మే 21 వరకు 115 మంది హతమయ్యారు. మొత్తంగా మావోయిస్టు పార్టీ చరిత్రలో ఒక్క ఏడాదిన్నరకాలంలో 330 మావోయిస్టులు మృతిచెందడం చరిత్రతో ఇదే మొదటిసారి కావడం గమనార్హమని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

**26న బంద్‌కు పిలుపు**

ఇటీవల ఛత్తీస్‌గడ్ దండకారణ్యంలో వరసగా జరగుతున్న ఎదురుకాల్పుల్లో మావోయిస్టులు మరణించిన నేపథ్యంలో బంద్ కు పిలుపు నిచ్చారు. పోలీసులు జరుపుతున్న మరణకాండలకు వ్యతిరేకంగామావోయిస్టులు మే 26న బంద్ పిలుపు నిచ్చారు. దీంతో భద్రతాదళాలు అప్రమత్తమయ్యాయి. ఈరోజు నుంచే అటు వైపు వెళ్లే వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. రహదారులపై మందుపాతరల వంటివి పెట్టారన్న అనుమానంతో అణువణువునూ చెక్ చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నారు.

# స్టేషన్ అభివృద్ధికి నేనే పట్టుబట్టా

- నేటికి అది సాకారమయ్యిందన్న మంత్రి పొన్నం
- తిరుపతికి రోజూ రైలు సర్వీస్ నడపాలని వినతి

**కరీంనగర్ :**
తాను కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు ఆనాటి రైల్వే శాఖ మంత్రి మమతా బెనర్జీ ఉన్నప్పుడు కరీంనగర్ ఈ స్టేషన్ ను మార్పు చేయడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలో 103 స్టేషన్ లలో తెలంగాణ నుండి కరీంనగర్, వరంగల్, బేగంపేట రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసి ప్రారంభం చేసుకున్నందుకు అభినందనలు తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పునరాభివృద్ధి చెందిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ను వర్చువల్‌గా ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మారుతున్న కాలానికి



అనుగుణంగా ప్రయాణికుల సౌకర్యం కోసం అధునాతన సౌకర్యాలతో పునరభివృద్ధి చేసుకొని ప్రారంభం చేసుకున్నామని, 1267, 1268 నంబర్ ట్రైన్ కరీంనగర్ నుంచి తిరుపతి, తిరుపతి నుంచి కరీంనగర్ వెళ్ళే రైలు వారానికి రెండు రోజులు నడుస్తుంది దానిని ప్రతిరోజూ లేదా వారానికి నాలుగు రోజులు నడిచేలా చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను పొన్నం కోరారు. తిరుపతి రైలుకు ప్రయాణికుల రద్దీ బాగుండడంతో నిత్యం వెళ్లేలా చేస్తే చాలా బాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ లో ఫర్టిలైజర్ లోడింగ్, అన్ లోడింగ్ హమాలీ సమస్యలను తొలగించామన్నారు. కరీంనగర్ నుంచి ముంబయి, షిర్డీలకు రైలు ప్రారంభిస్తే అందరికీ ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్కా కొమురయ్య పాల్గొన్నారు. కరీంనగర్ నుండి తిరుపతి వెళ్ళే వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలును ప్రతిరోజు నడిచేలా మార్చాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపత్రం సమర్పించారు.

# ఈడీ దూకుడుకు సుప్రీంకోర్టు బ్రేక్!

మొదటి పేజీ తరువాయి

స్కాంపై దర్యాప్తును నిలిపేస్తూ స్టే ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం రవాణాలో అవినీతి, బార్ లైసెన్స్‌ల మంజూరు, బాటిల్ తయారీ సంస్థలు, డిస్టిలరీలతో కుమ్మక్కై నిధులను స్వాహా చేయడం ద్వారా వచ్చిన లెక్కల్లో చూపని నగదు వంటి ఆరోపణలపై ఈడీ తమిళనాడులోని టాస్మాక్ లో తనిఖీలు చేస్తోంది. వీటిని సవాల్ చేస్తూ టాస్మాక్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఈడీకి చీవాట్లు పెట్టింది.

**వ్యక్తులపై కేసులు నమోదు చెయొచ్చు కానీ కార్పొరేషన్లపైనా మీ ప్రతాపం?**

వ్యక్తులపై కేసులు నమోదు చేయవచ్చు కానీ కార్పొరేషన్లపైనా? మీ ప్రతాపం అని ప్రశ్నించింది. ఈడీ అన్ని పరిమితులను దాటుతోందని వ్యాఖ్యానించింది. వేసవి సెలవుల తర్వాత ఈ వ్యవహారంపై విచారణ జరుపుతామని, అప్పటివరకూ ఈ కేసులో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఈడీని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల్ని తమిళనాడులో అధికార డీఎంకే స్వాగతించింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్న బీజేపీ ప్రయత్నాలకు తగిలిన దెబ్బగా దీన్ని అభివర్ణించింది.

# కళ్లకు కట్టినట్లు బిజెపి అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా సిద్ధమైందని చెప్పారు. దీని కోసం రూ.1480 కోట్ల వ్యయం అంచనా వేసినట్టు వివరించారు. త్వరలో కేం ద్రం దీనిపై నిర్ణయం తీసుకుంటుం దన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి నిత్య రైలు నడిపేందుకు తనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా లేఖలు రాశారని చెప్పారు. అయితే, రద్దీ , సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యపడ లేదని, ప్రస్తుతం వారానికి రెండుసార్లు నడుస్తున్న ఈ రైలును నాలుగు సార్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా రూ.25వేల కోట్లతో 1350 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో భాగంగా రూ.2 వేల కోట్లతో ఆధునీకరించిన 103 స్టేషన్లను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారని అన్నారు. కరీంనగర్ స్టేషన్ కూడా వాటిలో ఒకటి. రూ.27 కోట్ల వ్యయంతో జరిగిన ఆధునీకరణ పనుల తరువాత కరీంనగర్ రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఎయిర్‌పోర్టు స్థాయిలో సదుపాయాలు కలిగిన ఈ స్టేషన్‌లో లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఏసీ/నాన్‌ఏసీ వెయిటింగ్ హాల్స్, ఫుడ్ కోర్టులు, టాయిలెట్లు, సోలార్ ఎ÷-లాంట్ వంటి అనేక సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు సెల్ఫీలు తీసుకునే స్థాయికి ఇది చేరిందని ఆయన తెలిపారు. గత 11 ఏళ్లలో రాష్ట్రంలో 20కి పైగా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని, మొత్తం 2,298 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఒక్క తెలంగాణకే రూ.42,119 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రమే రూ.5,337 కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను త్వరలో అమృత్ భారత్ పథకంలో చేర్చుతామని, ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణంలో కూడా ఒక లైన్‌ను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. హసన్‌పర్తి-కరీంనగర్ నూతన రైల్వే మార్గానికి సంబంధించిన అన్ని చర్యలు వేగంగా పూర్తవుతాయని తెలిపారు.

# పాక్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాం

మొదటి పేజీ తరువాయి

జరిగిందని మోడీ చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు.. అమాయకులను లక్ష్యంగా చేసుకున్నారని.. మతం ఆధారంగా వేరు చేసి.. మహిళల నుదిటిపై ఉన్న సిందూరాన్ని తుడిచేశారని.. దానికి ప్రతీకారంగానే మన దళాలు వాళ్లను మట్టిలో పాతిపెట్టేశారన్నారు. 140 కోట్ల మంది భారతీయుల హృదయాలను గాయపరిచారు.. అందుకే వాళ్లను ముక్కలు.. ముక్కలు చేశామని వెల్లడించారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాదుల శిబిరాలు నాశనం అయినట్లు చెప్పారు. త్రివిధ దళాల దెబ్బకు పాకిస్థాన్ వెనక్కి తగ్గిందని తెలిపారు. ఇక అణు బాంబుల భయానికి భారతదేశం వెనుకాడదని మరోసారి మోడీ స్పష్టం చేశారు. 'సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశారు. ఏప్రిల్ 22న ఉగ్రదాడికి ప్రతిగా 22 నిమిషాల్లో ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం. ఉగ్రమూకలను మట్టిలో కలిపేశాం. నా సిరల్లో రక్తం కాదు సిందూరం ప్రవహిస్తోంది. పాక్‌లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ ఐసీయూలో ఉంది. అణుబెదిరింపులకు భారత్ ఇక ఏమాత్రం భయపడదు. పాక్‌తో ఎలాంటి వాణిజ్యం, చర్చలు ఉండవు. చర్చల మాట అంటూ వస్తే.. అది పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే. ఉగ్రదాడి జరిగితే.. పాక్ ఆర్మీ, ఆర్థికవ్యవస్థ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మనం స్పష్టంచేశాం. మన దేశానికి న్యాయంగా చెందాల్సిన నీరు ఇక పాక్‌కు ప్రవహించదు. భారత ప్రజల జోలికివస్తే.. గట్టి గుణపాఠం తప్పదు' అని గట్టి హెచ్చరికలు చేశారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీ కృషి జరుగుతోంది. ఈ దిశగా గత 11 ఏళ్లుగా అవిశ్రాంతంగా పనిచేశాం. భారత రైలు నెట్‌వర్క్ ఆధునికీకరిస్తున్నాం. వేగం, పురోగతికి వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రతీకలు అంటూ కేంద్ర ప్రభుత్వం చేపడుతోన్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునర్నిర్మించిన దేశ్‌నోక్ స్టేషన్‌ను ప్రారంభించారు. అలాగే బికనేర్-ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలుకు జెండా ఊపారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. అలాగే దేశ్‌నోక్‌లోని కర్ణిమాత ఆలయంలో పూజలు చేశారు. ఇక అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ స్టేషన్లను రాజస్థాన్ నుంచి వర్చువల్‌గా మోడీ ప్రారంభించారు. కొత్త స్టేషన్లను జాతికి అంకితమిచ్చారు. ఇందులో తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఏపీలోని సూళ్లూరుపేట అమృత్ భారత్ స్టేషన్‌ను కూడా ప్రారంభించారు. యూపీలో 19, గుజరాత్‌లో 18, మహారాష్ట్రలో 15, రాజస్థాన్‌లో 8 అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ పాల్గొన్నారు. అంతకుముందు బికనీర్‌లోని కర్ణిమాత ఆలయాన్ని ఆయన సందర్శించారు. అమ్మవారికి ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారి తీర్థ ప్రసాదాలను ఆలయ పూజారులు.. ప్రధాని మోదీకి అందజేశారు. అనంతరం బికనీర్ ఎయిర్ బేస్‌ను మోదీ సందర్శించారు. మరోవైపు బికనీర్ సమీపంలో పాలనా గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారిగా ప్రధాని మోదీ రాజస్థాన్‌లో పర్యటించారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన సరిగ్గా నెల రోజులకు ప్రధాని మోదీ రాజస్థాన్‌లోని బికనీర్ ఎయిర్ బేస్‌ను సందర్శించడం గమనార్హం.



# బాంబులు పెట్టి పేల్చారేమో

మొదటి పేజీ తరువాయి

ఖర్చులు చేస్తున్నరు.వరంగల్ మహాసభ విజయవంతం కాగానే నోటీసుల డ్రామా మొదలుపెట్టారని మండిపడ్డారు. కాళేశ్వరం ఒక ఇంజినీరింగ్ మార్వెల్ అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటూ.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన అద్భుత కట్టడాలను అందగత్తెలకు చూపించారు. లక్షన్నర కోట్లు అప్పు చేసి రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నించారు. అందాల పోటీలు రేవంత్ రెడ్డికి, భట్టి విక్రమార్కకు మధ్య జరుగుతున్నట్టు ఉన్నాయి. మిస్ వరల్డ్ బ్యానర్ల మీద రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు ఫొటోలు చూశా.. వారిలో ఎవరు మిస్ వరల్డ్ పోటీదారులో అర్థం కాలేదంటూ ఎద్దేవా చేశారు. చార్మినార్ అగ్నిప్రమాదంపై రేవంత్ రెడ్డికి రివ్యూచేసే సమయం లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కష్టంలో ఉన్న తల్లిలాంటి పార్టీని నమ్ముకొని ఉండే వారే నిజమైన కార్యకర్తలని కేటీఆర్ అన్నారు. అవకాశవాదులే సిగ్గులేకుండా పార్టీ మారుతారని విమర్శించారు. పార్టీ నుంచి పారిపోయిన వారి పేర్లు తీసుకొని వారిని పెద్దోళ్లను చేయొద్దన్నారు. పార్టీ కోసం కొట్లాడేవారికే అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలే రేవంత్ పాలనపై మండిపడుతున్నారని, ఇదేం పాలన అంటూ ఆ పార్టీ నాయకులే నిలదీస్తున్నారన్నారు. 'రాష్ట్రంలో కమిషన్ల పాలన కొనసాగుతున్నది. కమిషన్ల పనిలో కాంగ్రెస్ నేతలు బిజీగా ఉన్నారు. 30 శాతం కమిషన్ లేనిదే ఫైళ్లు కదులుతలేవు. తమ ప్రభుత్వంలో ఫైల్‌లు కదలాలి అంటే మంత్రుల చెయ్యి తడపాల్సిందేనని కొండా సురేఖ చెప్పారు. మా ప్రభుత్వంలో మంత్రులు 30శాతం కమిషన్ తీసుకుంటున్నారు ఇంకొక కాంగ్రెస్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చెప్పారు. ఈ కమిషన్ల నుంచి దృష్టి మరల్చేందుకే కాళేశ్వరం కమిషన్ అంటూ విమర్శలు గుప్పించారు. రెండు లక్షల రుణమాఫీ ఎంతమందికి చేశారు? రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి.. రూ.12వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేశారు. రుణమాఫీ ఇచ్చింది పావు వంతే. రాష్ట్రంలో 500 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులను పట్టించుకునే పరిస్థితి రాష్ట్రంలో లేదు. బీఆర్ఎస్ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. పల్లెలు, పట్టణాలు అభివృద్ధి పథంలో దూసుకుపోయాయి. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి లబ్ది జరిగింది. కుర్చీని కాపాడుకోవడానికి రేవంత్ రెడ్డి ఢిల్లీకి మూటలు మోస్తున్నారు. రైతుల ఖాతాల్లో రైతు బంధు పైసలు పడ్తలేవు.. కానీ ఢిల్లీలో రాహుల్ గాంధీ ఖాతాలో మాత్రం నెల నెలా టకీ టకీమని పడుతున్నాయ్. కాంగ్రెస్, బీజేపీ ఇద్దరూ దొంగలే.. ఇద్దరినీ నమ్మొద్దు. అప్రమత్తంగా ఉండి.. ఇద్దరినీ ఎండగట్టాలి. తెలంగాణకు గుండె ధైర్యమైన గులాబీ జెండాను మల్లొక్కసారి మనమే ఎగురవేయాలి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తగిన బుద్ధి చెప్పాలి. ఎవరికి టికెట్ వచ్చినా ప్రతీ కార్యకర్త తనకే అవకాశం వచ్చినట్టుగా కొట్లాడాలి. మళ్లీ నిర్మల్ జిల్లాలో గులాబీ జెండా ఎగిరేవరకు పోరాడుదామని కేటీఆర్ అన్నారు.

# ఫెమా నిబంధనలకు విరుద్ధంగా భూమి కొనుగోలు

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నుంచి పోటీ చేయాలని ఝాన్సీ రెడ్డి భావించారు. అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఓడించేందుకు కాంగ్రెస్ ఝాన్సీ రెడ్డిని రంగంలోకి దించేందుకు ప్లాన్ చేసింది. అయితే చివరి నిమిషంలో ఝాన్సీ భారత పౌరసత్వంపై వివాదం చెలరేగింది. ఆమె ఎన్ఆర్ఐ పౌరసత్వం కారణంగా సమస్యలు వస్తాయని భావించి కోడలు యశస్వినీ రెడ్డిని బరిలోకి దింపారు. ఎర్రబెల్లిపై ఆమె విజయం సాధించారు. ఇక చాలా ఏళ్ల క్రితమే అమెరికా వెళ్లిన ఝాన్సీరెడ్డి అక్కడ ఉమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ (వేటా) ఫౌండర్, ఫౌండర్ ప్రెసిడెంట్, అడ్వయిజరీ చైర్‌గా వ్యవహరించారు. ఇక్కడ రియల్‌ఎస్టేట్ వ్యాపారాలతోపాటు పలు బిజినెస్‌లు చేశారు. అనంతరం తెలంగాణ పాలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎన్నికలకు చాలా కాలం క్రితమే స్వస్థలం పాలకుర్తికి వచ్చిన ఆమె.. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

# ఐఏఎస్‌లా? పాదదాసులా?

మొదటి పేజీ తరువాయి

మాచారం గ్రామంలో ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించగా, మంత్రులు,ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలు,పార్లమెంటు సభ్యులు హాజరయ్యారు. రూ.12,600 కోట్లతో ప్రారంభించిన ఈ పథకం ద్వారా సుమారు 2.1 లక్ష మంది గిరిజన రైతులకు సోలార్ విద్యుత్ మోటర్లను అందించనున్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి లబ్ధిదారులకు మంజూరు సర్టిఫికెట్లు ఇస్తున్న సందర్భంలో పక్కనే ఉన్న గిరిజన శాఖ ముఖ్య కార్యదర్శి ఏ శరత్ ఆయన కాళ్లు మొక్కడం సంచలనం రేపింది. హఠాత్పరిణామంతో ఖిన్నుడైన ముఖ్యమంత్రి ఆయనను వారించే ప్రయత్నం చేశారు. ఈ ఘటనను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు టీవీ ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించి ఆశ్చర్యపోయారు.ముఖ్య కార్యదర్శి హోదాలో ఉన్న అధికారి సాధారణ పౌరుడి మాదిరి కాళ్లు మొక్కడం ఏంటని ముక్కున వేలేసుకున్నారు. ఈ ఘటనపై చర్చించుకోవడం తప్ప ఏమి చేయలేని పరిస్థితి కదా!

**ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ఒకప్పటి సిద్ధిపేట జిల్లా కలక్టర్**

(కన్ ఫామ్డ్)పరుపాటి వెంకట్రామ్ రెడ్డి కాళ్లు మొక్కే సంస్కృతికి శ్రీకారం చుట్టారు. కరీంనగర్ జిల్లాకు చెందిన వెంకట్రామ్ రెడ్డి గ్రూపు వన్ అధికారిగా ఎంపికై ఉమ్మడి రాష్ట్రంలో పలు జిల్లాల్లో పనిచేశారు. 2007 సంవత్సరంలో ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆశీస్సులతో సిరిసిల్ల, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల కలక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 2021 జూన్ నెలలో సిద్దిపేట జిల్లా కలక్టరేట్ భవనం ప్రారంభ సమయంలో తన నూతన చాంబర్‌లోని సీట్లో కూర్చునే ముందు వెంకట్రామ్ రెడ్డి నాటి సీఎం కేసీఆర్‌కు పాదాభివందనం చేసి, అక్షింతలు వేయించుకున్నారు. ఐఏఎస్ అధికారి అయి ఉండి కేసీఆర్ కాళ్లకు దండం పెట్టడంపై ప్రచార, ప్రసార సాధనాల్లో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ విమర్శలపై వెంకట్రామ్ రెడ్డి సమర్థించుకున్నారుగానీ కేసీఆర్ ఇలాంటి పద్దతి సరికాదని అధికారిక ప్రకటన చేయలేదు. ముఖ్యమంత్రి తన తండ్రిలాంటి వారని, అలాంటి పెద్ద మనిషి కాళ్లు మొక్కితే తప్పేంటని ఆనాడు వెంకట్రామిరెడ్డి ఎదురు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా కలక్టర్‌గా ఏకంగా ఏడు సంవత్సరాల పాటు పనిచేసి కేసీఆర్‌కు దగ్గరయ్యారు. తన ఉద్యోగానికి వీఆర్ఎస్ పెట్టి 2021లో బీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. కన్ ఫామ్డ్ ఐఏఎస్ అధికారి అయిన శరత్ గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అంతకు ముందు కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేశారు. జూన్ 2021లో కామారెడ్డి జిల్లా కలక్టరేట్ భవనాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. కలక్టర్ సీట్లో ఆసీనులు కావడానికి ముందు శరత్ కేసీఆర్‌కు పాదాభివందనం చేశారు. ఆయన కూడా ఏమీ తడుముకోకుండా, వారించకుండా ఆశీస్సులు ఇచ్చారు. మొదటిసారి జరిగిన ఈ ఘటనను కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఖండించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ షబ్బీర్ అలీ కేంద్రంలోని డీవోపీటీ మంత్రికి ఫిర్యాదు చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తొలిసారి కావడం, తెలిసీ తెలియక చేశారని అనుకున్నారు. కాని అదే తీరును మరోసారి ప్రదర్శించి, జనాగ్రహానికి గురవుతున్నారు. సోమవారం నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జ్ఞాపికను అందచేసిన తర్వాత ఆయన కాళ్లకు దండం పెట్టారు. పక్కనే ఉన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాదాలను కూడా తాకే ప్రయత్నం చేయగా, ఆయన ముందుకు కదిలారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం, పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు రావడంతో చర్యలకు ఉపక్రమించారు.

**కాళ్లు మొక్కితే చర్యలు తప్పవు : ప్రభుత్వ సీఎస్ రామకృష్ణా రావు**

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణా రావు మరుసటి రోజు రాత్రి పత్రికాప్రకటన విడుదల చేశారు ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు దిగజారి ప్రవర్తించొద్దని, విధుల పట్ల అంకిత భావం,నిబద్ధత తో ప్రజల విశ్వాసం పొందాలని సూచించారు. అతిక్రమిస్తే తగిన చర్యలు తప్పవని స్పష్టం చేయాల్సి వచ్చింది.ఇటీవలి కాలంలో కొంతమంది ఆల్ ఇండియా సర్వీస్ (ఏఐఎస్) అధికారులు సమావేశాలు, సభల్లో హోదాకు తగని విధంగా చర్యలు, హావభావాలు ప్రదర్శిస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ఇలాంటి ప్రవర్తన ప్రజల్లో ఏఐఎస్ అధికారుల మీద నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తుంది. ప్రజలతో సంబంధాల విషయంలోనూ, అత్యున్నత స్థాయి నైపుణ్యం, నిజాయతీ, నిబద్ధతను పాటించాల్సిన బాధ్యత కలిగి ఉండాలని, ఇది ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు అవసరమైన చర్య కాబట్టి, ఇకపై ఏ అఖిల భారత సర్వీసు అధికారులు అయినా, సమావేశాలు, సభల్లో మోకరిల్లడం, హావభావాలు ప్రదర్శించడం వంటి చర్యల నుంచి దూరంగా ఉండాలని అన్నారు. ఆదేశాల్నిఉల్లంఘించిన అధికారిపై చర్యలు తప్పవని కే రామకృష్ణా రావు స్పష్టం చేశారు.

**శరత్‌ను కాళ్లు మొక్కమని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారా?**

మాచారం సభలో శరత్ కాళ్లు మొక్కిన ఘటను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊహించలేదని అంటున్నారు. ఈ పరిణామం తరువాత సీనియర్ ఆఫీసర్లు ఆయన ముందు ప్రస్తావించారో? లేదా? స్వయంగా ఆదేశించారో? తెలియదు కానీ చర్యలు మాత్రం మొదలయ్యాయి. ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు మంగళవారం సాయంత్రం ఘాటుగా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కేసీఆర్ మాత్రం శరత్‌తో పాటు వెంకట్రామ్ రెడ్డి కాళ్లు మొక్కించుకున్న తర్వాత అయినా ఇది తప్పని మాత్రం ప్రకటించలేదు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆదేశాలు కూడా ఇప్పించలేదు. దీంతో శరత్ రెండో సారి సీఎం కాళ్లు మొక్కి స్వామి భక్తి నిరూపించుకునే పనిలో పడ్డారనే చెప్పాలి.

**నాయకుల విమర్శలపై ఖండించని ఐఏఎస్ అధికారుల అసోసియేషన్**

వికారాబాద్ జిల్లా కలక్టర్ ప్రతీక్ జైన్ పై దాడి, సిరిసిల్ల కలక్టర్ సందీప్ కుమార్ ఝాపై మాజీ మంత్రి కే తారక రామారావు చేసిన ఘాటు విమర్శలపై తెలంగాణ ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ప్రతీక్ జైన్ పై దాడి చేసిన వారిపై చట్టపరంగా తీవ్రమైన చర్యలు తీసుకోవాలని, సందీప్ కుమార్‌ను కాంగ్రెస్ వర్కర్ అంటూ చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంత వరకు బాగానే ఉంది కాని శరత్ కాళ్లు మొక్కడాన్ని మాత్రం ఇంత వరకు ఖండించలేదు. అందుకే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయనేది అసోసియేషన్ పసిగట్టకపోవడం దారుణమనే అభిప్రాయాలు రాజకీయ పరిశీలకుల్లో వ్యక్తమవుతున్నాయి.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUB-LICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

NEELAGIRI VARTHA TELUGU DAILY neelagirivartha@gmail.com
నీలగిరి వార్త
తెలుగు దిన పత్రిక మన కోసం మన వార్త
తెలంగాణ ఉమ్మడి జిల్లాలు
శుక్రవారం 23-5-2025
07



# కొండగట్టుకు పోటెత్తిన భక్తులు ఘనంగా హనుమ జయంతి వేడుకలు

**శ్రీరామ నామస్మరణతో మార్మోగుతున్న అంజన్న క్షేత్రం**



ప్రత్యేక ప్రతినిధి నీలగిరివార్త

హనుమాన్ జయంతి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు కు భక్తులు భారీగా తరలివచ్చారు. అంజన్నను దర్శించుకునేందుకు వర్షంలోనూ కాలినడకన భక్తులు చేరుకున్నారు. ఆంజనేయస్వామి మాలధారులు దీక్షా విరమణ చేస్తున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున కొండగట్టులో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లను కలెక్టర్ పరిశీలించారు.

**శ్రీరామ నామస్మరణతో మార్మోగుతున్న అంజన్న క్షేత్రం**

కొండగట్టు ఆంజనేయ ఆలయంకాషాయమైంది. జై శ్రీరాం,జైహనుమాన్ నామస్మరణతో మార్మోగుతోంది. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా భక్తులు, మాలధారులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అర్ధరాత్రి నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు.

# ఆల్ ఇండియా సైనిక్ స్కూల్లో సీటు సాధించిన జర్పుల యశ్వంత్

**తల్లిదండ్రులు ప్రతాప్ నగర్ మాజీ సర్పంచ్ జరుపుల లక్ష్మి, తిరుపతి**

**300 మార్కులకు గాను ఎస్టీ కేటగిరీలో 191 మార్కులు సాధించి సీటు సాధించిన విద్యార్థి**

**విద్యార్థినిని అభినందించిన అకాడమీ డైరెక్టర్**

**శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు తినిపించిన తల్లిదండ్రులు**





దేవరకొండ నీలగిరి వార్త

ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామి నేషన్‌లో డిండి మం డలంలోని ప్రతాప్ నగర్ మాజీ సర్పంచ్ జరుపుల లక్ష్మి తిరుపతి ల కుమా రుడు జరుపుల యశ్వంత్ నిన్న విడుదలైన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామి నేషన్లో 300 మార్కులకు గాను 191 ఎస్టి కేటగిరీలో సీటు సాధించడం జరిగిందని ప్రజ్ఞ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ కుకుడాల కవిత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని మంచి భవిష్యత్తులో సైతం ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.సంతోషం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు.

# వేములవాడ రాజన్న సన్నిధిలో పోటెత్తిన భక్తజనం

**హనుమాన్ జయంతి ఎఫెక్ట్.. వేములవాడ రాజన్న గుడిలో భక్తుల సందడి**





నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి

హనుమాన్ జయంతి సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది.స్వామివారిని దర్శించుకొని హనుమాన్ మాల ధరించిన భక్తులు కొండగట్టుకు బయల్దేరారు. వరకు సుమారు 45వేల 328 మంది భక్తజనం దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ముందుగా ధర్మగుండంలో స్నానాలు ఆచరించిన కోడె మొక్కులతో పాటు ఇతర మొక్కులు చెల్లించుకున్నారు.

# తెలంగాణలో వేగంగా అభివృద్ధి పనులు

**ప్రభుత్వం సహకరిస్తే..మరింత త్వరగా పూర్తి**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

**బేగంపేట అంతర్జాతీయ విమానాశ్రయంగా ఉందన్న కోమటిరెడ్డి**

హైదరాబాద్ నీలగిరివార్త :

తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకుతీసుకెళు తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట, కరీం నగర్, వరంగల్‌లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో మహిళలే పని చేయబోతున్నారని తెలిపారు. దేశంలో 1,300 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ప్రమాదాలు జరగకుండా కవచ్ టెక్నాలజీని తీసుకొచ్చినట్లు తెలిపారు.'తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రూ.80 వేల కోట్ల పనులకు సంబంధించి ప్రణాళికలు చేస్తున్నాం. దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తాం. ఎంఎంటీఎస్ రెండో ఫేజ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. యాదగిరిగుట్టకు కూడా ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తాం' అని కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని



కిషన్ రెడ్డి తెలిపారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని నరేంద్రమోడీ శంకుస్థాపన చేస్తే, మాజీ సిఎం కెసిఆర్ కనీసం రాలేదని విమర్శించారు. విప్లవాత్మకమైన అభివృద్ధి పనులు చేసి చూపిస్తామని అన్నారు. ఇప్పటికే చర్లపల్లి రైల్వేస్టేషన్ ను ప్రారంభించుకున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్రోచ్ రోడ్ కు భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఎంత వేగంగా సహకరిస్తే, అంతకంటే వేగంగా కేంద్రం నిధులు మంజూరు చేస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అమృత్ భారత్' పథకంలో భాగంగా దేశ వ్యాప్తం గా ఆధునికీకరించిన 103 రైల్వే స్టేషన్లను భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ జాబితాలో బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లు, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన సూళ్లూరు పేట స్టేషన్‌లు ఉన్నాయి. బేగంపేట రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి చూస్తున్న బేగంపేట స్టేషన్ ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపించేలా మారిందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, భవిష్యత్‌లో మరిన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి కట్టుగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. గట్కేసర్ నుండి యాదాద్రి వరకు భక్తుల కోసం ఎంఎంటీఎస్ సర్వీస్‌ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నల్గొండ రైల్వే మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరినట్లు చెప్పారు. ఘట్ కేసర్ ? యాదాద్రి మార్గాన్ని ఆరు నెలల్లో పూర్తిచేయాలన్న దిశగా ప్రయత్నిస్తున్నామని, దీనిపై సీఎంతో చర్చించి త్వరిత క్లియరెన్స్‌కి సహకరిస్తానని తెలిపారు.

# బిఆర్ఎస్ ఫ్యామిలీలో భగ్గుమన్న విభేదాలు

**పార్టీలో పనితీరుపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర అసహనం**

**బిజెపికి చేరువుతున్న తీరును తప్పు పట్టిన కవిత**

**పార్టీలో ఎవరికీ అందనంత దూరంగా కెసిఆర్ తీరు**

**పార్టీ రజతోత్సవ సభలో సీనియర్లకు దక్కని ప్రాధాన్యం**

**కెసిఆర్‌ను ప్రశ్నిస్తూ..లేఖను సంధించిన తనయ**

హైదరాబాద్– నీలగిరివార్త :

బిఆర్ఎస్ ఫ్యామిలీలో విభేదాలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు పదపదే చేస్తున్న ఆరోపణలు నిజం చేస్తూ కవిత రాసిన లేఖతో బటటబయలు అయ్యింది. దీంతో ఇప్పుడు బిఆర్ఎస్‌లో ఏం జరుగుతోందన్న వాదన జరుగుతోంది. తాజాగా తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యంగా బిఆర్ఎస్ పార్టీలో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్ తీరుపట్ల ఎమ్మెల్సీ కవిత ధిక్కార స్వరం వినిపించారు. పార్టీ తీరుపై నేరుగా కేసీఆర్‌కే ప్రశ్నలు సంధించారు. తన సందేహాలను వ్యక్తం చేస్తూ గురువారం నాడు కేసీఆర్‌కు సంచలన లేఖ రాశారు. ఈ లేఖలో బీజేపీతో బీఆర్ఎస్ దోస్తీ వ్యవహారాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ఇంకా ఈ లేఖలో ఆమె కేసీఆర్‌కు ఎలాంటి ప్రశ్నలు సంధించారనే వివరాలను చూస్తే, పార్టీ తీరుపట్ల ఆమె అసమనంగా ఉన్నట్లు తెలుస్తోంది. బిజెపితో అంటకాగేలా వ్యవహారాలు ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ నిర్ణయాలు, వ్యవహారాల పై సూటిగా ప్రశ్నలు సంధిస్తూ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. పార్టీ లీడర్స్‌కి యాక్సెస్ ఇవ్వడం లేదంటూ కవిత తన లేఖలో ఆరోపించారు. మై డియర్ డాడీ అంటూ కేసీఆర్‌కు లేఖ రాసిన కవిత.. బీజేపీతో బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపై తన సందేహాలను వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తు అంశంపై సిల్వర్ జూబ్లీ సభలో కూడా క్లారిటీ ఇవ్వలేదన్నారు. బీజేపీ విరీద రెండు నిమిషాలే మాట్లాడారని.. ఆ పార్టీపై ఇంకా బలంగా మాట్లాడాల్సిందని కవిత అభిప్రాయపడ్డారు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటారేమో అనే చర్చ మొదల్కెందన్నారు. తాను సఫర్ అయ్యాను కదా.. బహుశా అందుకని కావొచ్చు అని కవిత తన లేఖలో పేర్కొన్నారు. బీజేపీని ఇంకొంచెం టార్గెట్ చేయాల్సిందని కవిత తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. కాంగ్రెస్‌పై గ్రాస్‌రూట్స్‌లో నమ్మకం పోయిందన్న కవిత.. బీజేపీ ఆల్టర్‌నేటివ్ అనే ఆలోచనను మన కేడర్ చెబుతోందన్నారు. 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనం పోటీ చేయకుండా.. బీజేపీకి హెల్ప్ చేశామనే మెసేజ్ కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లింది. కేసీఆర్ యాక్సెస్ దొరకడం లేదని, సెలెక్టివ్ యాక్సెస్ అని జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యే స్థాయి నేతలు బాధ పడుతున్నారు. అందరికి అందుబాటులో ఉండేలా ప్రయత్నించండి అంటూ కూడా సూచనలు చేశారు. వరంగల్ సభలో ఉద్యమ నేతలకు సరైన ప్రాధాన్యం దక్కలేదు. 2001 నుంచి విరీతో ఉన్నవారికి మాట్లాడే అవకాశం ఇస్తే బావుండేది. పాత ఇన్‌చార్జ్‌లకే బాధ్యతలు ఇవ్వడం కూడా కేడర్‌కు నచ్చలేదు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నవారికి.. నేరుగా పార్టీ ఆఫీసు నుంచే బీ ఫామ్స్ ఇవ్వాలి. వరంగల్ సభలో ఉర్దూలో మాట్లాడలేదు, వక్ఫ్ బిల్లుపై మాట్లాడలేదు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం అంశాన్ని విస్మరించారు.' అని కవిత తన లేఖలో సంచలన అంశాలను ప్రస్తావించారు. వాస్తవానికి కవిత అమెరికాకు వెళ్లడానికి ముందే కేసీఆర్‌కు లేఖ రాసినట్లు కాంగ్రెస్ నేత సామ రామ్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ప్రెస్



విరీట్ పెట్టి మరీ ఈ అంశాన్ని హైలెట్ చేశారు. ఇప్పుడు ఆ లేఖ వ్యవహారం నిజమని తేలింది. లేఖలో పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే సామ చెప్పినట్లుగా కేసీఆర్ ఫ్యామిలీలో ఏదో నడుస్తోందనే అనుమానం మరింత బలపడుతోంది. అంతా కెటిఆర్ పెత్తనం సాగుతోందని, కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఇకపోతే ఫ్యామిలీలో కెసిఆర్‌ను పక్కన పెట్టారని, కెటిఆర్ అంతా తాన్కె కెసిఆర్‌ను కూడా పట్టించుకోవడం లేదన్న పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ వాదనలకు కూడా బలం చేకూరింది.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు కలెక్టర్‌తో కలిసి పంపిణీ చేసిన ప్రభుత్వ విప్

**ప్రణాళికాబద్ధంగా ఆలయ విస్తరణ పనులు:**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**శృంగేరి పీఠం అనుమతితో ఆలయ అభివృద్ధి పనులు**

**రెండో విడత క్రింద 484 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు**

**30 రోజులలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి**

**పేదల ఆత్మ గౌరవం పెంపోందించేలా సోంతింటి కల సాకారం**

నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి

వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రణాళికా బద్ధంగా విస్తరణ పనులు చేపడుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు.గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో రెండో విడత క్రింద 484 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇండ్లు లేని నిరు పేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని అన్నారు. గతంలో అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల రాలేదని అన్నారు. రాబోయే 4 సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చోప్పున ఇందిరమ్మ ఇండ్ల ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు.
ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మనం ప్రాంతంలో వేయి కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. గతంలో పాలకులు



వేములవాడ ఆలయానికి 100 కోట్లు విడుదల చేస్తామని మోసం చేశారని, నేడు ప్రజా ప్రభుత్వంలో వేములవాడ ఆలయ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.
వర్షాకాలం ముగిసిన తర్వాత 3వ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామని అన్నారు.గుడి చెరువు లో మురుగు నీరు కల్వకుండా 9 కోట్ల ఖర్చు చేసి నివారణ చర్యలు చేపట్టామని అన్నారు. మూల వాగు శుభ్రం చేస్తున్నామని అన్నారు. వేములవాడ ఆలయ విస్తరణకు పకడ్బందీగా చర్యలు చేపట్టామని, ఆలయం మూసివేస్తామని అపోహలు సృష్టిస్తున్నారని, భక్తులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి నిత్యం స్వామి వారికి నిత్యకృత్యం కైకంకర్యాలు జరుగుతాయని అన్నారు.
గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విద్వంసాన్ని సరిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు మహిళలకు ఆర్టీసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, రైతులకు 2 లక్షల వరకు పంట రుణ మాఫీ, సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్, రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రెసిడెన్షియల్ పాఠశాలలో 40% డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల చేపట్టామని అన్నారు.
ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులకు 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని అన్నారు. 400 గజాల నుంచి 600 గజాల లోపు ఏంటి నిర్మాణం జరిగితే 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా 5 లక్షల సహాయం అందుతుందని అన్నారు. బేస్మెంట్ దశలో 1లక్ష రూపాయల గోడల దశలో 1లక్ష వేలు స్లాబ్ దశలో 2 లక్షలు ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు ఇంటి జాగా లేని నిరు పేదలకు కూడా రెండవ దశలో ఇండ్లు తప్పకుండా ఇస్తామని ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో పేదలకు అసైన్మెంట్ భూముల పంపిణీ చేసింది తమ హయంలో మాత్రమేనని గత 10 సంవత్సరాల కాలంలో అసైన్మెంట్ కమిటీలు లేవని, నేడు మరోసారి భూ భారతి లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఇంటి స్థలాలు అందిస్తామని అన్నారు.
రాజీవ్ యువవికాసం క్రింద 4 వేల మంది యువతకు త్వరలో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు సబ్సిడీ విడుదల చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి స్థాయి సహకారం అందిస్తామని ప్రభుత్వం తరపున ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని తెలిపారు.
జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ భూమి లేని నిరు పేదలకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పూర్తి చేసి అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే తో కలిసి ప్రణాళికలు తయారు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం రాబోయే రోజుల్లో భూమి లేని నిరు పేదలకు ఇంటి పట్టాల పంపిణీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. వేములవాడ పట్టణ పరిధిలో నేడు పంపిణీ చేసిన 484 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు 30 రోజుల లోగా ప్రారంభించాలని అన్నారు. ఇంటి నిర్మాణంలో పేదలకు పూర్తి సహకారం అందిస్తామని పెట్టుబడి లేని పేదలకు లక్ష రూపాయలు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ శంకర్ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు వైస్ చైర్మన్ రాకేష్ సెస్ డైరెక్టర్ ఉమా ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యాప్రాల్ సాయిబాబా మందిరంలో ఘనంగా రాణి అహల్యాభాయి హెూల్కర్ జన్మదిన వేడుకలు





**నీలగిరి వార్త మల్కాజ్గిరి :**
రాణి అహల్యాభాయి హెూల్కర్ 300వ జయంతిని పురక్షరించుకుని మహిళా మోర్చా ఆధ్వర్యంలో యాప్రాల్ సాయిబాబ గుడిలో మహా హారతి కార్యక్రమం.

రాణి అహల్యాభాయి హెూల్కర్ 300వ జయంతిని పురస్కరించుకుని, మే 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పది రోజుల పాటు భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మే 22న యాప్రాల్ ఎంప్లాయిస్ కాలనీ సాయిబాబా గుడిలో మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ మరియు బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి డి. సుదర్శిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ 136వ డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, వాసంశెట్టి శ్రీనివాస్, ఉపేందర్ రెడ్డి, రమేష్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే డివిజన్‌కు చెందిన అనేక మంది కార్యకర్తలు భక్తిశ్రద్ధలతో హాజరై, ఈ మహా హారతిని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రాణి అహల్యాభాయి సేవలు, అమె ధైర్య సాహసాలను గుర్తు చేసుకుంటూ మహిళా మోర్చా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు మంచి స్పందనను పొందుతున్నాయి.

## ఘనంగా హనుమ జయంతి వేడుకలు



**నీలగిరి వార్త, సూర్యాపేట:-**
సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ రోడ్డులో గల శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం హనుమ జయంతి వేడుకలు వేద పండితులు ధరూరి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3 గంటల నుండి భానుపురి హనుమాన్ చాలీసా భక్త బృందం, హనుమత్ దీక్ష భక్త బృందం, హనుమాన్ చాలీసా పారాయణ భక్త బృందం చే 108 పర్యాయములు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. వేద పండితులు స్వామివారికి నిత్య ఆరాధన, ప్రత్యేక సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, నాగవల్లి దళార్చన, వెండి తమలపాకులతో అర్చన, స్వామికి ప్రత్యేక అలంకరణ నిర్వహించి నూతన పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆరగింపు, మంగళా శాసనం, తీర్థప్రసాద వినియోగంతో పాటు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. తెల్లవారుజాము నుండి పెద్ద ఎత్తున భక్తులు స్వామివారి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సుధాకర్ పివిసి ఎండి మీలా మహదేవ్, మాజీ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, పోలబోయిన నరసయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్లు ఎలిమినేటి అభినయ్, బైరు శైలేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీరన్న నాయక్, ముదిరెడ్డి లింగారెడ్డి , అబ్దుల్ రహీం , చల్లా లక్ష్మీకాంత్ ,జయ ప్రసాద్ , ఎస్ ఎల్ ఎస్ సాయి కృష్ణ , త్రివేణి అప్పారావు, హరికృష్ణ , బండారు సత్యనారాయణ, దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎం.పీ లక్ష్మణరావు, దరూరీ శ్రీధరాచార్యులు, ధరూరి శ్రీనాథ చార్యులు, ధరూరి పవన్ కుమార చార్యులు దరూరి కార్తీకా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి

### టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఖాదర్ బాబా డిమాండ్



**దేవరకొండ నీలగిరి వార్త**
పేదలు మధ్యతరగతి యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సదుద్దేశంతో తెలంగాణ జాతిపిత ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ ఎలాంటి నిబంధనలు పెట్టలేదని ప్రస్తుతానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిబిల్ స్కోర్ ఆధారంగా రాజీవ్ వికాసం పథకం అమలవుతుందని అనడం అత్యంత దురదృష్టకరమని దేవరకొండ పట్టణ 19 వ వార్డు బిఆర్ ఎస్ పార్టీ నాయకులు ఖాదర్ బాబా ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో 16 లక్షల మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ తర్వాత సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక ముఖ్యమంత్రి ప్రకటించడం లబ్ధిదారుల నోట్లో కొట్టడమే అవుతుందని. అంబేద్కర్ అభయహస్తం ఊసే లేదని 1 లక్ష నుండి 4 లక్షల నిబంధనలతో పేదల బతుకుల్లో ఎలాంటి మార్పు రాదన్నారు. కనీసం 10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువత తిరుగుబాటు తప్పదని పేర్కొన్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన పి ఏ సి చైర్మన్ గాంధీ



**శేరిలింగంపల్లి మాభూమి**
హనుమాన్ జయంతి పర్వదినంను పురస్కరించుకుని మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ విలేజ్ లో గల హనుమాన్ దేవాలయంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకలలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన చైర్మన్ ఆరెకపూడి గాంధీ . ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాటాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికి హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, ఎక్కడ శ్రీరాముడు కొలువై ఉంటాడో, ఎక్కడ శ్రీరామ నామం వినిపిస్తుందో.. అక్కడ హనుమంతుడు ఉంటాడు. ఆయనను మించిన భక్తుడు లేడంటూ శ్రీ రామచంద్రుడు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న భాగ్యశాలి హనుమంతుడు అని చైర్మన్ గాంధీ తెలియచేసారు. అదేవిధంగా రామాయణానికి ఓ నిండుదనాన్ని తీసుకు వచ్చాడు. సుగ్రీవుడిలో కదలిక తీసుకు వచ్చి అతని సైన్యాన్ని ముందుకు నడిపించడంలోనూ లంకలో ఉన్న సీతమ్మవారి ఆచూకీ తెలుసుకోవడంలోను ...వారధి నిర్మించడంలోను ... యుద్ధరంగాన లక్ష్మణుడు మూర్ఛ పోయినప్పుడు 'సంజీవిని' పర్వతాన్ని పెకిలించి తీసుకు రావడంలోను హనుమంతుడు కీలకమైన పాత్రను పోషించాడు. అందుకే హనుమంతుడు లేని రామాయణాన్ని అస్సలు ఊహించలేం అని, హనుమంతుడి గుడి లేని ఊరు లేదు అని చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఓం ప్రకాష్ గౌడ్, కృష్ణ పటేల్ గౌడ్, నాగేశ్వర్ గౌడ్, అశోక్, వెంకటేష్ గౌడ్, రవి గౌడ్, కృష్ణ గౌడ్, వీరేందర్, ప్రవీణ్, మహేందర్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, శివ ముదిరాజ్ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురంలో వైభవంగా కటాక్ష సిల్క్స్ ప్రారంభోత్సవం

**ప్రొప్రైటర్ నరసింహ్మా ఆధ్వర్యంలో ప్రముఖ యాంకర్ సుమ రిబ్బన్ కటింగ్**

**రాబోవు రోజులలో కటాక్ష సిల్క్స్ ఆకర్షణీయమైన వస్త్ర నిళయంగా ఉండబోతోంది**

**అందరికీ అందుబాటు ధరలో మాకు మేమే సాటి - ప్రొప్రైటర్ నరసింహ**



**వనస్థలి పురం నీలగిరి వార్త మే 22 :**
ప్రశాంత్ నగర్ ,గణేష్ టెంపుల్ రోడ్డు, పనమా గోడౌన్ సమీపంలో వనస్థలిపురంలో ప్రముఖ సామాజిక వేత్త, ఆధ్యాత్మిక చింతన కలిగిన ప్రొప్రైటర్ నరసింహ్మా ఆధ్వర్యంలో కటాక్ష సిల్క్స్ ను ఆడంబరంగా ప్రముఖ యాంకర్ కనకాల సుమ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సుమ మాట్లాడుతూ బోలెడన్ని వెరైటీలతో కటాక్ష సిల్క్స్ అందించే చీరలు ప్రజల మనసును ఆకర్షిస్తుందని అన్నారు. నిత్యం సంప్రదాయం ఆదునికతలు, కలగలిపిన నాణ్యమైన పట్టు చీరలు, ఫ్యాన్సీ చీరలు డిజైనర్ చీరలు ప్రజలకు అందుబాటు ధరలో ఆకర్షణీయమైన వస్త్ర నిలయంగా కటాక్ష సిల్క్స్ నిలువబోతుందని ఆకాంక్షించారు. సందర్భంగా నరసింహ మాట్లాడుతూ... ఇది మా మొదటి బ్రాంచ్ అని, రాబోవు రోజులలో ప్రజలకు మరింత చేరువై ప్రజల ఆశీర్వాదంతో యాంకర్ సుమ ఆశించినట్లుగా అనేక బ్రాంచీలు పెట్టడానికి మేం సిద్ధంగా ఉన్నామని అన్నారు. వనస్థలిపురం ప్రాంతమే కాకుండా యావత్ తెలుగు ప్రజలకు మా కటాక్ష సిల్క్స్ ద్వారా మేము అన్ని సామాజిక ప్రజలకు మరింత దగ్గర కానున్నామన్నారు. ప్రారంభం రోజే రికార్డు స్థాయిలో చీరలు అమ్ముడుపోయాయని, వినియోగం చేసిన ప్రజలు సంతోషంతో వెళ్లడం, మాకు తెలిసిన శ్రేయోభిలాషులకు కూడా సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని చేరవేస్తామని చెప్పడం మాకు మరింత ఆనందాన్ని చేకూర్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, కటాక్ష సిల్క్స్ అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అభినందనలు తెలిపారని అన్నారు.

## న్యూ సన్షైన్ డ్రైక్లీనింగ్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే





**దేవరకొండ నీలగిరి వార్త**
దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన న్యూ సన్షైన్ డ్రైక్లినింగ్ షాప్ దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకొండ లాంటి ప్రాంతాలలో సైతం ఇలాంటి వ్యాపారాలు నిర్వహిస్తున్నందుకు వ్యాపారులను అభినందిస్తున్నారని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డ్రై క్లినింగ్ ఆదరణ పెరిగిందని ప్రస్తుతం ఇలాంటి వ్యాపారాలకు మంచి స్పందన వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా షాపు యజమానులు మహేష్ ప్రశాంత్ ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ కొంద్ర శ్రీశైలం యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యునూస్, మాజీ ఎంపీపీలు ఏడ్పుల గోవింద్ యాదవ్, బిక్కు నాయక్, నాయకులు మాల్ రెడ్డి రవీందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, యువ నాయకులు మెడ సైదులు, సుభాష్ నాయక్, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేను బతికినంతవరకూ ఎల్లారెడ్డికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు తీసుకురావడమే నా లక్ష్యం: ఎమ్మెల్యే మదన్ మోహన్





ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మంజురు పాత్రలు అందచేసిన స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ .నాగిరెడ్డి పేట్ మండల జలాల్పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగింది. ఇందులో భాగంగా ఈరోజు స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ మోహన్ మంజురు పత్రాలు అందచేసి, ఇంటి నిర్మాణం కొరకు భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ గారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి ఎల్లారెడ్డి నియోజకవర్గ పేదలు సొంత ఇంటి కల కలగనే మిగిలిపోయింది. గత ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల వ్యవధిలోనే నియోజకవర్గానికి 3500 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు అయ్యాయి అని తెలిపారు. ప్రజలకు సొంత ఇంటి ఉండడం ఒక కల. ప్రజలు అందరు తమకు సొంత ఇల్లు ఉండాలని కోరుకుంటారు. ఇంటి నిర్మాణం కొరకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ చేసినందుకు చాల సంతోషంగా ఉంది అని అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గృహ నిర్మాణ శాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ పలువురు నాయకులు పాల్గొనడం జరిగింది.

## వడమాల అలంకరణలో ఆంజనేయస్వామి



**నీలగిరి వార్త, సూర్యాపేట:-**
సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ శర్మ ఆంజనేయస్వామిని భారీ వడమాలలతో ప్రత్యేకంగా అలంకరించి ఆకు పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు అనంతుల గణేష్, అనంతుల రామలింగయ్య, అనంతుల సందీప్, అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్, అనంతుల శ్రీను, అభివృద్ధి కమిటీ సభ్యులు వాసుదేవరావు, ప్రభాకర్ ల్, తోట శ్యాంసుందర్, గుండా శంకర్, రాజయ్య, దుర్గాప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ టెంపుల్ వార్షికోత్సవంలో పాల్గొన్న శాసన సభ్యులు మదన్ మోహన్



**నీలగిరి వార్త ఎల్లారెడ్డి (నాగిరెడ్డిపేటు):-**
నాగిరెడ్డిపేట్ ఎల్లమ్మ టెంపుల్ ను 8వా వార్షికోత్సవం సందర్భంగా దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ ,ఎమ్మెల్యే తో పాటు నాగిరెడ్డిపేట్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, నాగిరెడ్డిపేట్ ఎక్స్ సర్పంచ్ విట్టల్ రెడ్డి, మరియు రామచందర్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి నరసింహారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండల గౌడ సంఘ అధ్యక్షులు యాద గౌడ్, నాగిరెడ్డిపేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయ గౌడ్ ఆలయ కమిటీ చైర్మన్, వంశీ కృష్ణ గౌడ్ ,గౌడ సంఘం ప్రెసిడెంట్ ,మచ్చేందర్ గౌడ్ క్యాషియర్ ,యాద గౌడ్ మరియు మహేందర్ గౌడ్ సాయిబాబా గౌడ్, పోష గౌడ్ వెంక గౌడ్ పాల్గొన్నారు.

## శుభాకాంక్షలు తెలియజేసిన ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా



**నీలగిరి వార్త ఎల్లారెడ్డి.**
ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు కమ్మరి భాస్కర్ దంపతులకి పెల్లిరోజు వేడుక సందర్భంగా వారికి పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేసిన ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.

## శ్రీ బాల నగర వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా హనుమ జయంతి వేడుకలు



వరంగల్ సిటీ నీలగిరి వార్త.

గురువారం హనుమ్మజయంతి సందర్భముగా శ్రీ బాలా నగర వెంకటేశ్వర స్వామి ఆలయంలోని ఆంజనేయ స్వామి వారికి ఉదయం 9.00 గంటలకు పంచ కళశాలు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరిగినది, రాత్రి 7.00 గంటలకు హనుమాన్ చాలీసా 11 పర్యాయములు సామూహిక పారాయణం అనంతరం తీర్థ ప్రసాద గోష్టి జరిగినది. ఈ కార్యక్రమ నిర్వాహకులు శ్రీయుత జూలూరి పున్నారావు దంపతులు శ్రీ యాద శ్రీనివాస్ దంపతులు. నేటి కార్యక్రమములో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని నారని ఆలయ ఈ.ఓ శ్రీ ఏలాపాటి రత్నాకర్ రెడ్డి చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ 18004253424 కు కాల్ చేయండి.



### కలెక్టర్ డాక్టర్ సత్య శారద.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

జిల్లాలో ధాన్యం కోనుగొలు చేసే సమయంలో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగొలు ప్రక్రియ, ధాన్యం సేకరణ, రవాణా, మద్దతు ధర, సమాచారం కోసం, ఇతర ఫిర్యాదులు, ఇబ్బందుల పరిష్కారానికి రైతులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెం.18004253424 నెంబర్కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. దాన్యం కొనుగోలు ప్రక్రియ, రవాణా వంటి అంశాల్లో సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఫిర్యాదు చేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులు ఈ కాల్ సెంటర్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## రంగసాయిపేట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో వైభవంగా హనుమ జయంతి



### పాల్గొన్న 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణ చందర్ దంపతులు

వరంగల్ సిటీ నీలగిరి వార్త.

శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం రోజున శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్ ముతినేని రామమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు వెలిదే ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలలో 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలందరికీ హనుమాన్ భక్తులకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ అర్చకులు గంగు దేవేందర్, స్థానిక పెద్దలు బజ్జూరి మోహన్ రావు, అంకాల శ్రీనివాస్, నరేష్, పరికిపండ్ల రాజేశ్వర్ రావు, వనం బాబురావు, గుండు శివ, కొందోజు రాజేందర్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ గోవిందరాజస్వామి ప్రాంగణంలోని దేవాలయంలో వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు



వరంగల్ సిటీ నీలగిరి వార్త.

హనుమాన్ జయంతి వేడుకలు పురస్కరించుకుని ఈరోజు 27 డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్,ఆలయ చైర్మన్ మారిపెల్లి సంజీవ రావు, ఈవో భాస్కర్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమా న్ని శ్రీ అభయాంజనేయ స్వామి గుడి గోవిందరాజ ప్రాంగణంలో అంగ రంగ వైభవంగా నిర్వహించడం జరిగింది, దీనికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్ హాజరై ప్రత్యేక పూజలు జరిపించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది, ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బసవరాజ్ కుమార్,మాజీ కార్పొరేటర్ జరతీ రమేష్, మీసాల ప్రకాష్, బాష్పాక సదానందం, జరాతి శ్రీనివాస్, శరత్, చెమ్మలసాగర్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి

దేవరకొండ నీలగిరి వార్త

పేదలు మధ్యతరగతి యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సదుద్దేశంతో తెలంగాణ జాతిపిత ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ ఎలాంటి నిబంధనలు పెట్టలేదని ప్రస్తుతానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిబిల్ స్కోర్ ఆధారంగా రాజీవ్ వికాసం పథకం అమలవుతుందని అనడం అత్యంత దురదృష్టకరమని దేవరకొండ పట్టణ 19 వ వార్డు బిఆర్ ఎస్ పార్టీ నాయకులు ఖాదర్ బాబా ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో 16 లక్షల మంది నిరుద్యోగ యువత దర ఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ తర్వాత సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక ముఖ్య మంత్రి ప్రకటించడం లబ్ధిదారుల నోట్లో కొట్టడమే అవుతుందని. అంబేద్కర్ అభయహస్తం ఊసే లేదని 1 లక్ష నుండి 4 లక్షల నిబంధనలతో పేదల బతుకుల్లో ఎలాంటి మార్పు రాదన్నారు. కనీసం 10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువత తిరుగుబాటు తప్పదని పేర్కొన్నారు.

## కాజీపేట జంక్షన్ను డివిజన్గా ప్రకటించాలి

**కాజీపేటను మల్టీ మోడల్ రైల్వే స్టేషన్ గా అభివృద్ధి చేయాలి.**

**ఫాతీమ %=నాదీ%, కాజీపేట బస్టాండ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.**

**వరంగల్ ప్రజలకు ఈ రోజు ఒక శుభదినం.**

**కాకతీయ చారిత్రాత్మక కళ ఉట్టిపడేలా వరంగల్ రైల్వే స్టేషన్ ను ఏర్పాటు**

**వరంగల్ రైల్వే స్టేషన్ పునః ప్రారంభోత్సవ కార్యమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య.**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

ఉత్తర, దక్షిణ భారతానికి ముఖద్వారంగా, రాష్ట్రంలో రెండో అతి పెద్ద రైల్వే జంక్షన్ అయిన కాజీపేట జంక్షన్ ను రైల్వే డివిజన్గా ఏర్పాటు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం వరంగల్ రైల్వే స్టేషన్ పునః ప్రారంభోత్సవ కార్యమానికి కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలసి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య హాజరైన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ...ఈ రోజు వరంగల్ ప్రజలకు ఒక శుభదినం అన్నారు. కాకతీయ చారిత్రాత్మక కళ ఉట్టిపడేలా వరంగల్ రైల్వే స్టేషన్ ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. .ఇది నిత్యం ఇక్కడ రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులకు మౌలిక వసతుల కల్పనతో పాటు, ఆహ్లాదాన్ని పంచుతుందన్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ లో ప్రధానంగా ఎస్కలేటర్లు, విశాలమైన పాద చారుల వంతెన, కళాత్మక శిల్పాలు, విశాలమైన ప్రాంగణం ఇతర వసతులు కల్పించడం జరిగిందన్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా కాజీపేట రైల్వే స్టేషన్ లో ప్రస్తుతం 40 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి అన్నారు. త్వరిత గతిన పనులు పూర్తచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావలన్నారు. కాజీపేట ను మల్టీ మోడల్ రైల్వే స్టేషన్ గా అభివృద్ధి చేయాలని కోరారు. ఫాతీమ %=నాదీ%, కాజీపేట బస్టాండ్ పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, రైల్వే అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జీవజాతి పరిరక్షణకు పాటుపడదాం జీవవైవిద్యాన్ని కాపాడుదాం

### కొడిమాల శ్రీనివాసరావు.

వరంగల్ సిటీ నీలగిరి వార్త.



అంతర్జాతీయ జీవవైవిద్య దినోత్సవం సందర్భంగా చెట్లను నాటి మరియు వాటి పరిరక్షణ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొనిమాల శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడుతూ ప్రకృతిలో ఏ జీవి ఒంటరిగా జీవించలేదని కావున ప్రకృతితో సామరస్యం తోనే సృష్టి సుస్థిర అభివృద్ధి జరుగుతుందని మానవుని అత్యాశ ,దురాశ ,వికృత చేష్టలతో సకల జీవరాసులలో తో సందడిగా ఉన్న సృష్టి ఆందోళనలతో అల్లోకొల్లలమైపోయితుందని, పచ్చదనంతో పరిడవిలే ప్రకృతి అందాలు కనుమరుగై, భూతాపంతో ధరిత్రి మొత్తము దారుణంగా వేడెక్కిపోతుంది. ఏ కాలంలో జరగవలసిన ఆ కాలంలో జరగక కాలాలన్నీ గతి తప్పిపోయి ప్రకృతి విలయ తాండవం చేస్తుంది. ఇదంతా మానవుని స్వయంకృపరాధమే నివాసం మరియు ఆహారం కోసం పచ్చని చెట్లను నరకడం వల్ల ఆక్సిజన్ కరువై అలమటిస్తున్నాం, వాహనాల పొగ, ప్లాస్టిక్ అండ్ ఎలక్ట్రానిక్ వ్యర్థాల కాలుష్యము భూతాపంతో హిమనీ నదాలు కరిగి కన్నీరుగా ప్రవహిస్తున్నాయి ఇవన్నీ మానవజాతి మొనగాడకే మరణ మృదంగా వాయిస్తున్నాయి .కావున భవిష్యత్ తరాల మనుగడ కోసం పర్యావరణ పరిరక్షణ చర్యలు ప్రతి ఒక్కరూ చేపట్టాలని ఇందులో భాగంగా మొక్కలను పెంచి కాపాడాలని అంతరించిపోతున్న జీవజాతి పరిరక్షణకు పాటుపడి జీవవైవిద్యాన్ని కాపాడాలని ఈ సందర్భంగా కోరారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

కాజీపేట నీలగిరి వార్త.



కాజీపేట సపరివార సమేత స్వయంభు శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయ దివ్య క్షేత్రంలో నేడు హనుమాన్ జయంతి వేడుకలు దేవాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ యోగ ఆంజనేయ స్వామి వారు విశేష పూజలు అందుకున్నారు తొలుత సుప్రభాత సేవ అనంతరం మంగళ స్నానం పంచామృత అభిషేకము మన్యసూక్తభిషేకము పంచవర్ణాభిషేకము సహస్రధార ఏకధారాభిషేకము నిర్వహించగా అనంతరం స్వామివారికి అలంకరణ సింధూర పూజ తమలపాకు పూజ బడమాలన స్తోత్రం హనుమాన్ చాలీసా పారాయణం సుందరకాండ పారాయణం నిర్వహించడం జరిగింది . మరియు యాగశాల నందు యోగ ఆంజనేయ స్వామి వారి మూలమంత్ర హవనాన్ని నిర్వహించడం జరిగింది దేవాలయ ఇంచార్జ్ పుల్యాల అరుణ్ రెడ్డి నిర్వహించగా దేవాలయ పరిపాలన నిర్వాహకులు అయినవోలు సాయి కృష్ణ శర్మ మంత్రోచ్చారణ నడుమ ఈ యొక్క అభిషేక పూజా కైంకర్యాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది భక్తులందరికీ స్వామి వారి తీర్థ ప్రసాద వితరణ అన్నపూర్ణ భవన్లో అన్నదానం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యకర్తలు గంటా సీనమ్మ చొక్కారపు శ్రీనివాస్ పాక పవన్ రాంప్రసాద్ అనురాధ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు దేవాలయ సిబ్బంది మేనేజర్ లక్క రవి అసిస్టెంట్ మేనేజర్ దుర్గం సుధీర్ పి పిఆర్వో మనీ గంటా శ్రీనివాసరావు పద్మ వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు అని దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ తెలిపారు.

## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉంటుందని శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల నీలగిరి వార్త.



గురువారం గీసుగోండ మండల కేంద్రంలోని కొనయ మాకుల రైతు వేదికలో గీసుగోండ సంగెం మండలాల 15,16,17 డివిజన్ల కు చెందిన 74 మంది లబ్ధిదారులకు 74లక్షల 8వేల584 రూ విలువ గల కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నామని,పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్షమని అన్నారు.ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత సంక్షేమ పథకాలకి ఇస్తుందని,ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుందని అన్నారు.నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రెండు లక్షల లోపు రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 500రూ గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ, రేషన్ కార్డులు పంపిణీ,భరోసా తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు.పేద ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను అమలుపరిచే దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని,పరకాల నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం శ్రీ హనుమాన్ జన్మ దినోత్సవం సందర్భంగా గీసుగోండ మండలం కోనాయమాకుల గ్రామంలోని శ్రీ శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

## 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ని పరామర్శించిన

### జిల్లా టిడిపి నాయకులు చిలువేరు రవీందర్, చిరబోయిన రాజు, తౌటం సంపత్.



వరంగల్ సిటీ నీలగిరి వార్త.

తెలుగుదేశం పార్టీ వరంగల్ తూర్పు నియోజకవర్గం తరపున కార్పొరేటర్ గుండేటి నరేందర్ ని కలిసి సంఘీభావం తెలపడం జరిగింది తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ శిర బోయిన రాజు తౌటం సంపత్ కుమార్ కాంద్రాతి రాజు సంఘీభావం తెలిపిన వారిలో ఉన్నారు.

## హన్మకొండ నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన నరసింహారావు



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు హన్మకొండ డివిజన్ నూతన ఏసీపీగా నరసింహారావు నేడు బాధ్యతలు చేపట్టారు. అనంతరం వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ను పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏసీపీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. 1995 ఎస్సై బ్యాచ్కు చెందిన నరసింహారావు గతంలో హన్మకొండ, జనగామ, నర్సంపేట ఇన్స్పెక్టర్గా పనిచేశారు.

## శ్రీ లక్ష్మీ గణపతి సహిత అభయాంజనేయ స్వామి దేవాలయంలో వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు







వరంగల్ సిటీ నీలగిరి వార్త.

గురువారం రోజున హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఉదయం 8:30 గం.లకు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని పత్తి యార్డు 1వ నెంబర్ గద్దె ఆవరణలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ శ్రీ లక్ష్మి గణపతి సహిత అభయాంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అన్న ప్రసాద వితరణ చేయడము జరుగుతున్నది. ఈ సంవత్సరము అన్న ప్రసాద వితరణ దాతగా చల్లా శ్రీనివాసరెడ్డి ఓం సాయి ట్రేడర్స్ ఓం సాయి కోల్డ్ స్టోరేజ్ గ్రూప్స్లు మహా అన్న ప్రసాదము " వితరణ చేయడం జరిగినది. ఈ మహా అన్న ప్రసాదము వితరణ కార్యక్రమములో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి , ఛాంబర్ కమిటీ, రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ ఉప్పుల శ్రీనివాస్ , ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జి. రెడ్డి ఛాంబర్ అన్ని సెక్షన్ల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, సమస్త వ్యాపారస్తులు, రైతు సోదరులు, మార్కెట్ కమిటీ సిబ్బంది, , గుమస్తా, దడవాయి సోదరులు, మరలలో వివిధ హమాలి కార్మిక సోదరులు, భక్తులు సుమారు 10,000ల మంది పాల్గొని విజయవంతమొనార్చినారు.

